



డోన్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్వో ప్లాంట్లు ఇలా

● డోన్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 28 ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. వీటిలో ఒకటి, రెండు మినహా ఏ ప్లాంటుకూ అనుమతి లేదు. డోన్ మండల పరిధిలో ఏడు ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. వీటి పరిస్థితి కూడా అంతే. అనుమతులు లేకపోవడంతో పాటు అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సురక్షిత నీటి పేరుతో ఇష్టారాజ్యంగా వ్యాపారాలు సాగుతున్నాయి.



ఆత్మకూరులో సీజ్ చేసిన ఆర్వో ప్లాంట్ (ఫైల్)

● ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో సుమారు 20 ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. ఇక్కడ ఏ ఒక్కదానికీ అనుమతులు లేవు. ఈ ఏడాది మార్చిలో కలుషిత నీటితో పిల్లలు అనారోగ్యానికి గురయ్యాయని ఆరోపణలు రావడంతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ఆఘమేఘాలపై తనిఖీలు చేశారు. ఆయా ప్లాంట్ల వారీగా నమూనాలు సేకరించి కేవలం ఒకే ఒక ప్లాంట్‌ను మాత్రమే సీజ్ చేశారు. మిగిలిన వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఆర్వో ప్లాంట్ ఇలా..

● నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో వందకు పైగా ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో చాలా వరకు ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారు. కనీస నిబంధనలు పాటించడం లేదు. మున్సిపల్ అధికారులు కొన్ని రోజులుగా తనిఖీలు చేయడం ప్రారంభించారు. దీంతో నమూనాలు సేకరించడం.. ఆ తర్వాత లోపాలు ఉన్నట్లు గుర్తించడంతో ఐదు ఆర్వో ప్లాంట్‌లను సీజ్ చేశారు. మరో రెండింటికి నోటీసులు జారీ చేశారు.



మాయాజలం..!

- ● పుట్టగొడుగుల్లా ఆర్వో ప్లాంట్లు
- ● నిబంధనలు పాటించని నిర్వాహకులు
- ● ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- ● అనుమతులు లేకుండానే వ్యాపారాలు
- ● తనిఖీలు చేయకపోవడంతో ఇష్టారాజ్యం
- ● జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి

నంద్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో భాగంగా ప్రజలు ప్యూరిఫైడ్ నీటిని తాగేందుకు అలవాటుపడ్డారు. ఆరోగ్యం కోసం అంటూ ఆర్వోప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. నిజానికి ఆర్వోప్లాంట్లలో స్వచ్ఛమైన తాగునీరు వస్తున్నాయా? అన్న విషయాన్ని కూడా పక్కనే పెట్టే ప్రజలు ఆర్వో నీటి కోసం పరుగులు పెడుతున్నారు. జనావాసాల మధ్య బోర్లు వేసి నిబంధనలు పాటించకుండా వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో తూతూ మంత్రంగా బోరు నీటిలో కొన్ని కెమికల్స్ కలిపి నీటిని సరఫరా చేస్తున్నారు. నిబంధనలు పాటించని నీటి ప్లాంట్లపై అధికారులు తనిఖీలు చేయకపోవడం నిర్వాహకులకు కాసుల వర్షం కురిపిస్తోంది. నాణ్యత లేని నీటిని తాగి పలు ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు సైతం అనధికారికంగా కొనసాగుతున్న తాగునీటి ప్లాంట్లవైపు కన్నెత్తి చూడకపోవడంతో నిర్వాహకులు మరింత రెచ్చిపోతున్నారు. ఏది ఏమైనా జిల్లాలో నిబంధనలను కాలరాస్తూ సురక్షిత నీటి పేరుతో విచ్చలవిడిగా ఆర్వో ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. అసలే వేసవి కావడంతో ఇదే అదునుగా భావించి జిల్లాలో ఎక్కడ చూసినా ఆర్వో ప్లాంట్‌లు (తాగునీటి సురక్షిత ప్లాంట్) విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. ఆదాయమే లక్ష్యంగా నిర్వాహకులు నిబంధనలకు పాతరేసి విక్రయాలు చేస్తున్నారు. జిల్లాలో ఆర్వో ప్లాంట్ల ద్వారా సురక్షిత నీటి పేరుతో నెలకు రూ.కోట్లలో వ్యాపారం సాగుతోంది. బిందె రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. అదేవిధంగా 20 లీటర్ల వాటర్‌క్యాన్ రూ.10 నుంచి రూ.15 వరకు ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు. కొన్నిచోట్ల ఈ ధరలకు మరో రూ.5 అదనం. ప్రధానంగా నంద్యాల, బేతంచెర్ల, డోన్, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు మున్సిపాలిటీలతో పాటు మేజర్ పంచాయతీలలో కూడా ఎక్కడ చూసిన ఆర్వోప్లాంట్లలో ఇదే తంతు జరుగుతోంది.

● నిబంధనలకు మంగళం

నిబంధనల ప్రకారం ఎవరైనా ఆర్వో ప్లాంట్ పెట్టాలంటే స్థానిక పంచాయతీ లేదా.. సచివాలయం, మున్సిపాలిటీల ద్వారా అనుమతి పొందాలి. అదేవిధంగా ట్రేడ్ లైసెన్సు కూడా పొందాలి. తమ దరఖాస్తుతో పాటు అద్దె లేదా సొంత స్థలానికి సంబంధించిన ఆస్తి పన్నుల వివరాలు, తమ అడ్రస్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌నుఅందజేయాలి. ప్రధానంగా నీటి నాణ్యతను ధ్రువీకరించే ఐఎస్ఐ వంటి సంస్థల నుంచి పత్రం పొందాలి. బోర్ పర్మిషన్ కూడా ఉండాలి. నిజానికి ఒక ప్లాంట్ ఏర్పాటు కోసం సుమారుగా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నాణ్యమైన పాలిథిలిన్, పాలీ ప్రొపలైన్‌తో తయారు చేసిన నీటి క్యాన్లను మాత్రమే వినియోగించాలి. నీటి నాణ్యతను పరిశీలించేందుకు కెమిస్ట్రీ ల్యాబ్ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. కానీ ఈ నిబంధనలను లెక్కచేయని నిర్వాహకులు రూ.2లక్షల ఖర్చుతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఓ రేకుల షెడ్డు, సింథటిక్ ట్యాంకు, తక్కువ ధరకు ఓ నీటి శుద్ధి యంత్రంతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని నీటిని విక్రయిస్తున్నారు.

● తనిఖీలు చేస్తున్నారా?

జిల్లాలో ఆర్వో ప్లాంట్ ద్వారా నెలకు రూ. కోట్లలో వ్యాపారం జరుగుతోంది. నిబంధనలు పాటించని ఆర్వో ప్లాంట్ నిర్వాహకులపై తనిఖీలు ఆశించిన స్థాయిలో చేయకపోవడంతో ఆయా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యాపారాలు చేసి సొమ్ముచేసుకుంటున్నారు. కనీస నిబంధనలు పాటించకపోవడంతో పాటు సదరు ఆర్వో ప్లాంట్ల ద్వారా వచ్చే నీరు సురక్షితమైనదా? కాదా? అనే తెలుసుకునే అవకాశం కూడా లేకపోవడంతో ఆర్వో ప్లాంట్ల నుంచి ప్రజలు నీటిని తెచ్చుకుంటున్నారు. దీంతో ప్రజలు అనారోగ్యాన్ని నీటి రూపంలో కొని తెచ్చుకుంటున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులను కట్టడి చేయాలని నీటి శుద్ధి ప్రక్రియ చేయని నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నాణ్యత ప్రమాణాలను అతిక్రమించి నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

ఇవేమైనా పాటిస్తున్నారా?

● ప్రతి రోజూ టోటల్ డిసాల్వ్‌డ్ సాలిడ్స్(టీడీఎస్) పరికరంతో పరిశీలించి నీటి సాంద్రత ఎంత ఉందో నమోదు చేసుకోవాలి.

● ఆర్వో ప్లాంట్ల నుంచి నీటిని తీసుకెళ్లే క్యాన్లు మూడు లేదా.. నాలుగు నెలలు మాత్రమే వాడాలి. ఆ తర్వాత వినియోగించరాదు.

● ప్రతి నెల ప్లాంట్లలోని యంత్రాల్లో ఉండే ఫిల్టర్లను శుభ్రం చేయాలి. పాడైతే తక్షణమే కొత్తవి వేయాలి.

● ఆర్వో ప్లాంట్ల నుంచి సరఫరా చేసే క్యాన్లపై తమ కంపెనీ వివరాలు, ధర, నీటి ప్యాకింగ్ తేది, ఐఎస్ఐ సర్టిఫికెట్ నంబరు, లైసెన్సుతో పాటు తమ ప్లాంట్ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలి.

● నమూనాలు సేకరిస్తున్నాం



నంద్యాల పట్టణంలోని ఆర్వో ప్లాంట్లను పరిశీలించి నమూనాలు తీస్తున్నాం. ఇప్పటికే ఐదు ఆర్వో ప్లాంట్లను సీజ్ చేశాం. మరో రెండింటికి నోటీసులు జారీ చేశాం. మిగిలిన వాటిని కూడా పరిశీలించి లోపాలుంటే తగిన చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా నిర్వహించే వాటిపై తగిన నివేదికను రెవెన్యూ అధికారులకు పంపుతాం. ప్రభుత్వం మున్సిపాలిటీల ద్వారా అందించే నీరు స్వచ్ఛమైనది. ఈ నీటిని తాగితే ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవు.

- నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

● అనారోగ్యానికి గురవుతారు



ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు నీటిని శుద్ధి చేయడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఆ నీటిని తాగిన వారు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. పరిశుభ్రత వాతావరణంలో శుద్ధి చేయాలి. లేకుంటే విరేచనాలు, వాంతులు, కడుపునొప్పి తదితర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కొందరికి చర్మ వ్యాధులు కూడా వచ్చే అవకాశం లేకపోలేదు. అధికారుల అనుమతి ఉన్న ఆర్వో ప్లాంట్ల నీటిని మాత్రమే తాగాలి.

- డాక్టర్ మల్లేశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంట్

● మున్సిపల్ నీటినే తాగండి



ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తోంది. రూ.కోట్లు ఖర్చు పెట్టి మున్సిపాలిటీల ద్వారా నీటిని సరఫరా చేస్తోంది. నిబంధనల ప్రకారం నిత్యం శుభ్రం చేయడం, క్లోరినేషన్ చేయడం, శాంపిల్స్ తీసి సురక్షితంగా ఉన్న తర్వాతే సరఫరా చేయడం జరుగుతోంది. కాబట్టి ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి ఆర్వో ప్లాంట్ల నీటిని వదిలి.. మున్సిపల్ నీటిని తాగి ఆరోగ్య వంతంగా ఉండాలి. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు కూడా అవగాహన కల్పించాలి. మున్సిపాలిటీ నుంచి సరఫరా అయ్యేవి మాత్రమే మంచినీరు.

- రాజకుమారి, కలెక్టర్, నంద్యాల

అవగాహన కల్పించండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): హెపటైటిస్-బి, సి-వైరస్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరి హాల్‌లో హెపటైటిస్-బి, సి-వైరస్‌పై మైక్రోబయాలజీ విభాగాధిపతి డా. శ్రీనివాస్‌తో కలెక్టర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెపటైటిస్-బి, సి-వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జీజీహెచ్‌లో ఉచితంగా పరీక్షలను చేయించుకొని పాజిటివ్‌గా నిర్ధారణ అయితే వైద్య సేవలు పొందేలా చూడాలని అన్నారు.

గిరిజన ఉపాధులపై దృష్టి సారించాలి

జిల్లాలోని 14మండలాల్లో 45నివాసిత గిరిజన ప్రాంతాల్లో ఉన్న గిరిజనుల జీవనోపాధులపై దృష్టిసారించి వాటిని మెరుగుపరచాలని ఆదేశించారు. సోమవారం ఆర్‌ఏఆర్ఎస్‌లో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై 7రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు.

నీటి కుంటల నిర్మాణాలను చేపట్టండి

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన 2500 పంట నీటికుంటల నిర్మాణాలను చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి ఎంపీడీవోలను ఆదేశించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఉపాధి హామీ, ఇళ్ల నిర్మాణాలపై సమావేశం నిర్వహించారు.

రీ ఓపెన్ దరఖాస్తులపై దృష్టి పెట్టండి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నుంచి ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులలో రీ ఓపెన్ అయిన వాటిపై సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరిహాల్‌లో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలనుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు 290దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 96 ఫిర్యాదులు : ఎస్పీ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలోని బొమ్మలసత్రం వద్దనున్న జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 96ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి చట్టపరిధిలో చట్టపరంగా ఉన్నవాటికి తక్షణ పరిష్కారం చూపుతామన్నారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

25న గురుకులాల ప్రవేశ పరీక్షలు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలు, కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి ఈనెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, ఇందుకుగాను అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 5,6,7,8వ తరగతులకు గాను 836 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వారికి నంద్యాల పట్టణంలో 4 సెంటర్లు ఏర్పాటు చేశామని అన్నారు. వారికి ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో చేరడానికి 1961 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారికి 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షను నిర్వహిస్తామన్నారు.

ఇట్లా పనులు చేయవచ్చా?

- ● 40 శాతం తక్కువకు టెండర్లు
- ● పనుల్లో నాణ్యత సాధ్యమేనా?
- ● ఉమ్మడి జిల్లాలో 44 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు
- ● నిర్వహణకు రూ.40.07 కోట్లతో టెండర్లు
- ● పలు స్కీంలకు 40.01 శాతం తక్కువ ధరలకు షెడ్యూల్ దాఖాలు
- ● పల్లె ప్రజలకు తాగునీటి సరఫరాలో మాయాజాలం

కర్నూలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వంద రూపాయలతో చేయాల్సిన ఒక పనిని రూ.60లకు చేస్తే.. నాణ్యతా ప్రమాణాలు గంగలో కలుస్తాయి. ప్రభుత్వ కార్యకలాపాల్లోని మాయాజాలం వల్ల విచిత్రాలు ఎన్నయినా జరుగుతాయి. ఉమ్మడి జిల్లాలో గ్రామీణ తాగునీటి సరఫరా కోసం సమగ్ర రక్షిత మంచినీటి పథకాల (సీపీడబ్ల్యూఎస్) నిర్వహణలో ఇలాంటివి కనిపిస్తున్నాయి. ఈ విభాగంలో ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్ (ఎస్ఎస్ఆర్) ప్రకారం టెండర్లు పిలిచారు. 10 శాతం వరకు తక్కువ ధరలకు టెండర్లు వేయడం సహజం. 25 శాతం వరకు ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. ఏకంగా 40 శాతం తక్కువకే తాగునీటి సరఫరా చేస్తాం అంటూ పలు స్కీంలకు కాంట్రాక్టర్లు షెడ్యూల్ దాఖలు చేశారు. ఇది ఎలా సాధ్యం..? అని ఇంజనీర్లే ప్రశ్నిస్తున్నారు. ఎలాగైనా పనులు దక్కించుకొని ఆ తరువాత ఇంజనీర్లు, అధికార కూటమి ప్రజా ప్రతినిధుల అండతో మాయ చేయవచ్చనే ఉద్దేశంతో టెండర్లు వేసి ఉంటారనే ఆరోపణలు లేకపోలేదు. దీని వెనుక ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారి పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండర్లు పూర్తై 20 రోజులైనా కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ చేసుకోలేదు. ఈ వివరాలపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గ్రామీణ తాగునీరు సరఫరా, పారిశుధ్యం శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) పర్యవేక్షణలో 60 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు (సీపీడబ్ల్యూఎస్) ఉన్నాయి. 555 గ్రామాలకు శుద్ధి చేసిన (ఫిల్టర్) తాగునీరు అందిస్తున్నారు. వీటి నిర్వహణకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) గ్రాంట్ కింద ప్రభుత్వం ఏటేటా రూ.85.71 కోట్లకు పైగా ఖర్చు చేస్తుంది. కర్నూలు జిల్లాలో 354 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం 33 సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణకు రూ.49.29 కోట్లు ఖర్చు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 201 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంగా 27 సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణకు రూ.36.42 కోట్లు ఖర్చు చేస్తున్నారు. జిల్లా పరిషత్ (జడ్పీ) నిధులు మంజూరు చేసి పరిపాలన అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. తాగునీటి పథకాలు నిర్వహణ, తాత్కాలిక మరమ్మతులు, సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు కోసం నిధులు వెచ్చించాలి. నిర్వహణ బాధ్యతలు టెండర్లు ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. ఆయా సీపీడబ్ల్యూఎస్ స్కీంల ద్వారా గ్రామాలకు శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేస్తే.. ఎస్ఎస్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్స్ నుంచి నీటి సరఫరా చేసే గ్రామాలకు మధ్య దూరాన్ని బట్టి కిలో లీటరు (1,000 లీటర్లు)కు కనిష్ఠంగా రూ.6.24 గరిష్ఠంగా రూ.14 చెల్లిస్తారు. రోజు వారిగా ఏ గ్రామానికి ఎంత నీటిని సరఫరా చేశారో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎం-బుక్ రికార్డులు చేసి బిల్లులు చెల్లించాలి.



కౌతాళం సమగ్ర రక్షిత మంచినీటి పథకం (సీపీడబ్ల్యూఎస్) ఎస్ఎస్ ట్యాంక్

● 40.01 శాతం తక్కువ రేట్లకు టెండర్లు:

కర్నూలు జిల్లాలో 25, నంద్యాల జిల్లాలో 19 సీపీడబ్ల్యూఎస్ స్కీంలు 2025-26లో నిర్వహణకు రూ.40.07 కోట్లతో గత నెల (మార్చి) 3న ఏపీ ఇ-ప్రొక్యుర్‌మెంట్ టెండర్ నోటీస్ ఏటీఓ/81 నుంచి 124/2024-25 కింద గ్రామీణ తాగునీరు సరఫరా, పారిశుధ్యం శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ) టెండర్లు పిలిచారు. అదే నెల 12వ తేది నుంచి టెండరు బిడ్ షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకొని.. ఆఖరు తేది 25వ తేదిలోగా ఆన్‌లైన్‌లో టెండరు షెడ్యూల్ దాఖలు చేశారు. అదే రోజు టెక్నికల్ బిడ్, ఆ తరువాత ప్రైజ్ బిడ్ ఓపన్ చేశారు. ఇంజనీర్లే విస్తుపోయేలా ఆదోని డివిజన్ పరిధిలో పెసలబండ, కుప్పగల్, హాల్వి, కౌతాళం, సాతనూరు, మండిగిరి సమగ్ర రక్షిత మంచినీటి పథకాలకు ఓ కాంట్రాక్టర్ ఏకంగా ప్రతిపాదన టెండర్ రేట్లకు 40.01 శాతం తక్కువ ధరలకు టెండరు షెడ్యూల్ దాఖలు చేశారని ఇంజనీర్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం 25 శాతం వరకు తక్కువ ధర (లెస్)కు టెండర్ వేస్తే ఆమోదిస్తారు. లెస్‌కు 25 శాతం కంటే ఎంత ఎక్కువ వేశారో.. ఆ మొత్తాన్ని కాంట్రాక్టర్ డిపాజిట్ చేశాకే అగ్రిమెంట్ చేసుకోవాలి. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే తాగునీటి పథకాల నిర్వహణలో కాంట్రాక్టర్లు ప్రతిపాదన రేట్ల కంటే 40 శాతం తక్కువకే నీటిని సరఫరా చేయడం సాధ్యమేనా..? టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన తొలి జడ్పీ సమావేశంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఇదే అంశంపై గట్టిగా నిలదీస్తే ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఇందులో మర్మమేమిటో నిగ్గు తేల్చాలని

మిగతా 6వ పేజీలో..

ఫలితాల టెన్షన్..

- ● రేపు పది పరీక్షా ఫలితాలు
- ● ఉదయం 10 గంటలకు విడుదల
- ● తేలనున్న 25,542 మంది విద్యార్థుల భవితవ్యం

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పదో తరగతి పరీక్షా ఫలితాల మరో 24 గంటల్లో విడుదల కానున్నాయి. పరీక్షలు ముగిసిన 22 రోజుల్లోనే ఫలితాల విడుదలకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఫలితాలను 23వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం డైరక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 25,542 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 13,353 మంది బాలురు, 12,189 మంది బాలికలు ఉన్నారు. 285 ప్రభుత్వ పాఠశాలలు, 173 ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాశారు. రెగ్యులర్ విద్యార్థులు 20,021, ఒకేషనల్ 4,752, సప్లిమెంటరీ 769 మంది విద్యార్థులున్నారు.



● గత ఏడాది బాలికలదే హవా!

గత ఏడాది 23,787 మంది పరీక్షలు రాయగా 20,367 మంది ఉత్తీర్ణత సాధించి 85.62 శాతంతో నంద్యాల జిల్లా 19వ స్థానంలో నిలిచింది. అందులో బాలికలు 88.24 శాతం, బాలురు 83.17 శాతం సాధించారు. బాలికలదే పైచేయిగా ఉంది. జిల్లాలోని 16 ఎయిడెడ్ పాఠశాలల్లో 72.10 శాతం, 6 బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో 99, 12 ప్రభుత్వ పాఠశాలల్లో 67.90, ఐదు ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో 79.44, 27 కేజీబీవీల్లో 88.14, నాలుగు మున్సిపల్ హైస్కూల్స్‌లో 79.12, 20 మోడల్ స్కూల్స్‌లో 95.11, 173 ప్రైవేట్ పాఠశాలల్లో 97.37, 7 ట్రైబల్ వెల్ఫేర్ స్కూళ్లలో 89.78శాతం, 182 జడ్పీ పాఠశాలల్లో 76.57 శాతం ఉత్తీర్ణత సాధించారు.

● మన మిత్ర ద్వారా ఫలితాలు

విద్యార్థులు మన మిత్ర వాట్సాప్ నుంచి ఫలితాలు పొందవచ్చు. 9552300009 నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ పంపి, ఆ తర్వాత విద్యాసేవలను ఎంచుకుని, ఆపై ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకోవాలి. అనంతరం వారి రోల్ నంబర్‌ను నమోదు చేయడం ద్వారా ఫలితాల పీడీఎఫ్ కాపీని పొందవచ్చు. అలాగే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పూల పరిమళాలు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ వివిధ రంగుల, పరిమళాల పూలతో కళకళలాడుతోంది. నిజానికి ఇది సాధారణ పూల వినియోగ కాలం కాదు. పండుగలు అయిపోయాయి.. పెళ్లి ముహూర్తాలు పెద్దగా లేవు...శుభకార్యాలు అంతంత మాత్రమే. దీంతో పూల ధరలు అమాంతం తగ్గిపోయాయి. కొనుగోళ్లు కూడా తగ్గాయి. అయినామార్కెట్‌లో తాజా పూలు ఘుమ ఘుమలాడుతున్నాయి. మరోవైపు వాతావరణం అనుకూలించడంతో పూల దిగుబడి ఇబ్బడిముబ్బడిగా పెరిగి అన్ని రకాల పుష్పాలు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఈ పరిస్థితులు పూల రైతును దారుణంగా దెబ్బతీస్తున్నాయి. దిగుబడి ఉన్నా తగినంత ధర లేకపోవడం, ఉపాధి పనులతో కూలీలు దొరకకపోవడం వల్ల ఒకవైపు రైతులు, అమ్మకాలు లేక వ్యాపారులు విలవిలలాడిపోతున్నారు.

- మార్కెట్‌లోకి వివిధ రకాల పూలు
- దిగివచ్చిన ధరలు
- నంద్యాల జిల్లాలో 3వేల హెక్టార్లలో పూలసాగు
- ప్రతిరోజూ టన్ను పూలను విక్రయిస్తున్న వ్యాపారులు




జాజిపూలతోట

● జిల్లాలో 3వేల హెక్టార్లలో పూలసాగు

నంద్యాల జిల్లాలో 3వేల హెక్టార్లలో రైతులు పూలను సాగుచేస్తున్నారు. నంద్యాల కేంద్రంగా ప్రతి రోజు టన్ను పూలు అమ్ముడవుతున్నాయి. ప్యాపిలి, డోన్, బేతంచర్ల, పాణ్యం, చాగలమర్రి తదితర మండలాల్లో అధిక ధరలున్న మల్లెపూలు, కనకాంబరాలు, చామంతులు అత్యధికంగా పూలను సాగుచేశారు. వాటితో పాటు మిగిలిన మండలాల్లో కూడా బంతిపూలు, లిల్లీపూలు, గులాబీలు, జాజిపూలు 909 హెక్టార్లలో సాగు చేస్తుండగా 18,009 టన్నుల దిగుబడి వచ్చింది. ప్రతిరోజు మార్కెట్‌కు రెండు టన్నుల మేర చేరుకుంటోంది. దీంతో ఒక్కసారిగా మార్కెట్ పడిపోయింది..

మార్కెట్‌లోకి అనేక రకాల పూలు విక్రయానికి వస్తున్నాయి. ఒకేసారి పెద్ద మొత్తంలో పంట చేతికిరావడంతో ధరలు తగ్గిపోయాయని వ్యాపారులు వాపోతున్నారు. కిలో రూ.500 నుంచి రూ.800 ధర పలికిన మల్లెపూలు నేడు రూ.200లతో గొల్లుమంటున్నాయి. కనకాంబరాలు సీజన్‌లో రూ.600 నుంచి రూ.800 వరకు విక్రయించేవారు. నేడు రూ.200 నుంచి రూ.250కు ధర పడిపోయింది. గులాబీలు కిలో రూ.300 నుంచి రూ.350 వరకు ఉండగా నేడు రూ.150కు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం లిల్లీపూలు కేజీ రూ.150, చామంతి పూలు రూ.200, జాజి పూలు రూ.250 నుంచి రూ.300కు కొద్ది ధరల తేడాతో విక్రయిస్తున్నారు. మిగిలిన పూల పరిస్థితి మరింత దిగజారింది. మన జిల్లాలో పూలకు మార్కెట్ దారుణంగా ఉండడంతో చాగలమర్రి, కానగూడూరు గ్రామాల రైతుల నుంచి వ్యాపారులు జాబిపూలు, మల్లెపూలు, కనకాంబరాలను కొనుగోలు చేసి ముంబాయికి ఎగుమతి చేస్తున్నారు. కర్నూలు జిల్లా కంటే నంద్యాల జిల్లాలోనే అత్యధికంగా పూలసాగు చేస్తున్నారు.



మండలం	సాగు హెక్టార్లలో	పంట దిగుబడి (టన్నుల్లో)
మల్లెపూలు		
చాగలమర్రి	314	3,454
ప్యాపిలి	58	638
డోన్	50	550
రుద్రవరం	40	440
శిరువెళ్ల	42	460
బేతంచర్ల	28	308
ఇతర మండలాలు	218	2,380
మొత్తం	**750**	**8,230**
చామంతులు		
డోన్	513	26,676
బేతంచర్ల	390	20,280
ప్యాపిలి	60	3,120
ఇతర మండలాలు	68	3,546
మొత్తం	**1031**	**53,622**
కనకాంబరాలు		
డోన్	90	360
ప్యాపిలి	35	140
ఇతర మండలాలు	89	356
మొత్తం	**214**	**856**

● మార్కెట్ లేదు



నంద్యాల మార్కెట్‌లో డిమాండ్ బాగున్నప్పుడు టన్ను నుంచి టన్నున్నర వరకు పూలు అమ్మాము. జిల్లాలో పూల దిగుబడి అధికంగా ఉంది. దీంతో ఒకేసారి అన్నిరకాల పూలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. మార్కెట్ ఒక్కసారిగా పడిపోయింది.

\- ఫారూక్, హోల్‌సేల్ పూల వ్యాపారి, నంద్యాల.

● దిగుబడి అధికంగా వచ్చింది



జిల్లాలో ఈ ఏడాది పూలు అధికంగా దిగుబడి వచ్చాయి. మార్కెట్ లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాము. నేను ఐదు ఎకరాల్లో పూలు సాగు చేస్తున్నాను. ఉపాధి పనులు ఉండడంతో పూలు కోయడానికి కూడా కూలీలు రావడం లేదు. ఉపాధి పనులను రైతులకు అనుసంధానం చేస్తే రైతులు కూడా కోలుకుంటారు. నష్టాల నుంచి బయటపడతారు.

\- శ్రీనివాసులు, పూల రైతు, రాయమాల్పురం

● శుభాకార్యాలు లేవు



ఏప్రిల్, మే నెలల్లో పెద్దగా శుభాకార్యాలు, పెళ్లిళ్లు లేకపోవడం వల్లనే పూలను కొనడానికి వినియోగదారులు ముందుకు రావడం లేదు. దీంతో పాటు కర్నాటకతో చిక్‌బళ్లాపూర్, బెంగుళూరు నుంచి పూలు అధికంగా వస్తున్నాయి. వాటికి కూడా పెద్దగా డిమాండ్ లేదు.

\- నబీరసూల్, పూలవ్యాపారి, నంద్యాల


పూలవ్యాపారం


బంతిపూల తోట

బొప్పాయే..

- అమాంతంగా పడిపోయిన బొప్పాయి ధరలు
- గత నెల టన్ను రూ.20 వేలు ● ప్రస్తుతం రూ.5 వేలు
- తోటలను దున్నేస్తున్న రైతులు


చిన్నవంగలిలో బొప్పాయి తోటను దున్నేస్తున్న రైతు

చాగలమర్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధర లేక రైతులు కుదేలవుతున్నారు. పెట్టుబడి కూడా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే టన్నుకు రూ.15వేలకు పైగా ధర పడిపోవడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామంలో సోమవారం కొందరు రైతులు ఆశలు వదులుకొని బొప్పాయి తోటలను ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. ఎకరాకు రూ.లక్ష దాక వ్యయం చేశామని, ధర లేక బొప్పాయి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు వెంకటరెడ్డి, నరసింహులు, రమణారెడ్డి, నాగిరెడ్డి, జయరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఎకరాల దాక బొప్పాయి తోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. గత నెలలో టన్ను బొప్పాయి రూ.20 వేలు పలికిందని, ప్రస్తుతం ధర రూ.5 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బొప్పాయి కాయలు చెట్లకు ఉన్నా పెట్టుబడులు కూడా రావని ట్రాక్టర్లతో దున్నేస్తున్నట్లు తెలిపారు. పంట దిగుబడి ఉన్నా ధర పతనంతో నష్టపోయామని రైతులు వాపోయారు. అధిక వర్షాలు, వైరస్ వల్ల కూడా తోటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.


ధర లేక పొలంలోనే వదిలేసిన బొప్పాయి కాయలు

అభివృద్ధి, సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి
- టీజీవీ కళాక్షేత్రంలో చంద్రబాబు జన్మదిన వారోత్సవాలు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన సందర్భంగా కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'చంద్రబాబు వజ్రోత్సవ జన్మదిన వారోత్సవాలు' రెండోరోజు సోమవారం కొనసాగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన బైరెడ్డి శబరి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ నేతలు చంద్రబాబు జన్మదినోత్సవాన్ని ఒక్కరోజు జరిపి అలసిపోయారని, కానీ కర్నూలు కళాకారులు వారం రోజుల పాటు నిర్వహించడం అభినందనీయమన్నారు. గత ఐదేళ్లుగా కళాకారులకు ఎలాంటి పురస్కారాలు, సత్కారాలు లేవని, ఈ ఏడాది చంద్రబాబు కళాకారులను గుర్తించారన్నారు. కళాకారులను గౌరవిస్తే ప్రభుత్వం క్షేమంగా ఉంటుందని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవ వారోత్సవాలు అవధానంతో ప్రారంభించామని చెప్పారు. యువ ఎంపీ బైరెడ్డి శబరి పార్లమెంటులో రాష్ట్రంలోని రంగస్థల కళాకారుల సమస్యలను కేంద్ర ప్రభుత్వానికి వివరించాలని కోరారు. అనంతరం బైరెడ్డి శబరి ఇటీవల కందుకూరి పురస్కారాలు అందుకున్న రంగస్థల నటులు గాండ్ల లక్ష్మన్న, జీవీ శ్రీనివాసరెడ్డిలను ఘనంగా సత్కరించారు. అలాగే నాటక టెక్నీషియన్లు అయిన హార్మోనిస్టు బలరాముడు, తబలిస్టు మహేష్, కీబోర్డు ప్లేయర్ శ్రీనివాసాచారి, మేకప్‌మెన్ శ్రీనివాసులు, సురభి సంతోషలను సత్కరించారు.


మాట్లాడుతున్న ఎంపీ శబరి



● అలరించిన 'జగదేక సుందరి సామా'

టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'జగదేక సుందరి సామా' పౌరాణిక పద్య నాటకం అసాంతం అలరించింది. పత్తి ఓబులయ్య, దివంగత నాటక రచయిత పల్లేటి కులశేఖర్ సంయుక్తంగా రాసిన ఈ నాటకానికి పత్తి ఓబులయ్య దర్శకత్వం వహించారు. అలనాటి చింతామణి నాటకాన్ని మరపిస్తూ ఈ సామా నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ నాటకంలో ఇటీవల కోర్టు సినిమాలో నటించి పేరుతెచ్చుకున్న సురభి ప్రభావతి, హసీనా, జీవీ శ్రీనివాస రెడ్డి, సంగా ఆంజనేయులు, కె. బాలవెంకటేశ్వర్లు, రాజారత్నం, మహమ్మద్ మియా, గాండ్ల లక్ష్మన్న నటించారు. నాటకంలోని వివిధ సన్నివేశాల్లో సాగే పద్యాలకు ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు.

● నేడు ఏపీ నాటక అకాడమీ చైర్మన్ రాక

టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న చంద్రబాబు జన్మదిన వజ్రోత్సవ సాంస్కృతిక వారోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం 'శ్రీకృష్ణ కమలపాలిక' పద్య నాటక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని కళాకారులు తమ సమస్యలను చైర్మన్‌కు వినతిపత్రాల ద్వారా వివరించవచ్చని కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు.


నాటక సన్నివేశం


కళాకారుడికి సన్మానం

పనుల్లో నాణ్యత సాధ్యమేనా?

(5వ పేజీ తరువాయి)

పలువురు కోరుతున్నారు. అత్యల్పంగా నంద్యాల జిల్లాలో 44 గ్రామాలకు తాగునీరు అందించే ఆళ్లగడ్డ రక్షిత మంచినీటి పథకం నిర్వహణకు రూ.1.21 కోట్లకు టెండర్లు పిలిస్తే 0.35 శాతం తక్కువ, మెజార్టీ స్కీంలకు 25 శాతం వరకు లెస్‌కు టెండర్లు వేసినట్లు తెలుస్తున్నది.

● అగ్రిమెంట్ చేయడంతో జాప్యం ఎందుకో..?:

టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి 21 రోజులు గడిచినా టెండరు దక్కించుకున్న ఎల్-1 కాంట్రాక్టరుతో అగ్రిమెంట్ చేయకపోవడం వెనుక అంతర్యమేమిటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. 40 సీపీడబ్ల్యూఎస్ స్కీంలకు టెండర్లు పిలిచారు. అందులో 18 స్కీంలకే కోర్టు కేసులు ఉన్నాయి. మిగిలిన 22 స్కీంలకు కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకోలేదు. అయితే.. కాంట్రాక్టర్ల నుంచి ఒత్తిడి పెరగడంతో ఆదోని డివిజన్ పరిధిలో 5, నంద్యాల డివిజన్ పరిధిలో 5 స్కీంలకు మాత్రమే రెండు మూడు రోజుల క్రితం అగ్రిమెంట్ చేసినట్లు తెలుస్తుంది. అగ్రిమెంట్ చేయాలంటే టెండరు విలువపై 1-2 శాతం మామూళ్లు ఓ ఉన్నతాధికారి డిమాండ్ చేయడం వల్లేనే జాప్యం జరుగుతుందనే ఆరోపణలు లేకపోలేదు. అంతేకాదు.. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన ఆ అధికారికి ఇప్పటికీ ఆ వాసన పోలేదని, వైసీపీ సానుభూతిపరులైన కాంట్రాక్టర్లకే తెరవెనుక మద్దతు ఇస్తూ.. టీడీపీ కూటమి సానుభూతిపరులైన కాంట్రాక్టర్లను లేనిపోని కొర్రీలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వాస్తవంగా మార్చి 31వ తేదిలోగా టెండర్లు ప్రక్రియ, అగ్రిమెంట్ పూర్తి చేసి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణ బాధ్యతలు ఓ అండ్ ఎం కాంట్రాక్టర్లకు అప్పగించాల్సి ఉండేది. జాప్యం ఎందుకో..? అధికారులే సమాధానం చెప్పాలని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు వివరణ కోసం ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

పర్వతారోహకుడికి ఆర్థిక సాయం


సురేష్‌బాబుకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, జియో మైసూరు కంపెనీ

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నేపాల్ దేశంలోని ప్రపంచంలోనే ఎత్తయిన 7వ ధౌలగిరి శిఖరం అధిరోహించేందుకు మన దేశానికి చెందిన అతి చిన్న వయస్సు పర్వతారోహకుడైన సురేష్‌బాబు అనే వ్యక్తికి ప్రోత్సాహకంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసినట్లు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. జియో మైసూరు కంపెనీ సీఎస్ఆర్ నిధుల కింద ఆర్థిక సాయం అందజేసిందని తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సురేష్‌బాబుకు రూ.లక్ష చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా గోనెగండ్ల గ్రామ నివాసి అయిన సురేష్‌బాబు (25) చిన్న వయసులోనే ప్రపంచంలోని ఎత్తయిన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేసీ డా.బి.నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, పొల్యూషన్ కిషోర్ రెడ్డి, జియో మైసూరు కంపెనీ ప్రతినిధి రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కళలను ఆదరించాలి

- మిమిక్రీ కళాకారుడు ఖాదర్‌బాబు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మిమిక్రీ కళాకారుడు ఖాదర్ బాబు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కళలను ప్రోత్సహిస్తూ, కళాకారులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని రిటైర్డ్ ఉద్యోగి, మిమిక్రీ కళాకారుడు పి.ఖాదర్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో విలేకరుల సమావేశంలో బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ఆదివారం కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం డ్యామ్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పదవీ విరమణ చేసిన తాను నలభై ఏళ్లుగా సాంస్కృతిక, కళా రంగాల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. నాటక రంగంలో, యూట్యూబ్ చరిత్రలో సరికొత్త ప్రయోగంతో శ్రీకృష్ణ రాయబారం నాటకం నుంచి శయన ఘట్టంలోని శ్రీకృష్ణ, అర్జున, దుర్యోధన పాత్రల్లో త్రిపాత్రాభినయం చేసి, దర్శకత్వం వహించి రూపొందించిన టెలీఫిల్మ్, సీనియర్ సినీ నటుల గెటప్‌లతో షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అనంతరం అభినందన సభ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పి. రంజిత్‌బాషా, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌లను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించామని, విశిష్ట అతిథిగా కళారత్న, హంస అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య విచ్చేస్తారని తెలిపారు.

సూపర్ స్పెషాలిటీ పరీక్షలో

కేఎంసీ విద్యార్థుల సత్తా


- స్టేట్ ఫస్ట్, సెకండ్, థర్డ్ ర్యాంకులు కైవసం


మహేష్, కార్డియాలజీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు


ఆదిత్య, నెఫ్రాలజీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు


రంగవేణమ్మ, నెఫ్రాలజీ స్టేట్ ఫస్ట్ ర్యాంకు


హిమజ, యురాలజీ స్టేట్ సెకండ్ ర్యాంకు


కిషణ్ రెడ్డి, ప్లాస్టిక్ సర్జరీ స్టేట్ మూడో ర్యాంకు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్పెషాలిటీ ఫైనల్ ఇయర్ పరీక్షల్లో కర్నూలు మెడికల్ కాలేజీ వైద్యవిద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విజయవాడ సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో కర్నూలు మెడికల్ కాలేజీ కార్డియాలజీ విభాగానికి చెందిన 2022-24 బ్యాచ్ వైద్యవిద్యార్థి డా. మహేష్ పునుగుపాటి 800 మార్కులకు గాను 567 మార్కులు సాదించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు, నెఫ్రాలజీ విభాగానికి చెందిన డా. ఆదిత్య, డా. రంగవేణమ్మ ఇద్దరు 800 మార్కులకు 602 మార్కులు ఇద్దరు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకును సంయుక్తంగా సాదించారు. యురాలజీ విభాగంలో ఫైనల్ ఇంటర్ విద్యార్థిని డా.హిమజ 800 మార్కులకుగాను 619 మార్కులు సాధించి స్టేట్ సెకండ్ ర్యాంకు సాధించింది. ప్లాస్టిక్ సర్జరీ విభాగం నుంచి డా. కిషన్ రెడ్డి స్టేట్ థర్డ్ ర్యాంకు సాధించారు. సూపర్ స్పెషాలిటీ విభాగంలో కార్డియాలజీ, నెఫ్రాలజీ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యురాలజీ ప్లాస్టిక్ సర్జరీ విభాగాల్లో మొత్తం 9మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. అందరు మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందారని ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మ తెలిపారు.

గొడవలకు దూరంగా ఉండండి

- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

వెల్దుర్తి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గొడవలకు దూరంగా ఉండాలని బొమ్మిరెడ్డి గ్రామ ప్రజలకు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. సోమవారం బొమ్మిరెడ్డి పల్లెలో పర్యటించి, గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. అన్యాయం జరిగిందని చట్టాన్ని చేతులోకి తీసుకోవద్దని, నేరం చేసినవారికి చట్ట ప్రకారం శిక్షలు ఉంటాయని అన్నారు. సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావలని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పిల్లలతో మాట్లాడుతూ బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. సీఐలు తేజమూర్తి, మదుసూదన్‌రావు, రామయ్యనాయుడు, విజయలక్ష్మీ, ఎస్‌ఐలు ఖాజావలి అశోక్, మల్లికార్జున ఉన్నారు.

వైసీపీ నాయకుల జోలికొస్తే సహించం

జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే విరూపాక్షి



కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న వైసీపీ నాయకులు

ఆలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే విరుపాక్షి కూటమి నాయకులను హెచ్చరించారు. సోమవారం ఆలూరు మండలంలోని అరికెరలో రెండు నెలల క్రితం హత్యకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న కుటుంబానికి మాజీ సీఎం వైఎస్ జగన్ పంపిన రూ.5లక్షల చెక్కును నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే విరూపాక్షి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగానికి రాజీనామా చేయలేదన్న కారణంతోనే కూటమి నాయకులు ఈరన్నను హత్య చేశారన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ ముందుకొచ్చారన్నారు. ఈరన్న భార్యకు అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలి ఉద్యోగం ఇప్పిస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కురువ శశికళ, నాయకులు తెర్నకల్ సురేంద్ర రెడ్డి జడ్పీటీసీ సభ్యులు దొరబాబు, రామకృష్ణ, మండల కన్వీనర్ మారయ్య, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కబళించిన రోడ్డు

- పెళ్లి పత్రికలు పంచి వెళ్తుండగా ప్రమాదం
- మరో ఎనిమిది రోజుల్లో యువకుడి పెళ్లి



నాగేంద్ర (ఫైల్)

పాములపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మరో ఎనిమిది రోజుల్లో యువకుడి పెండ్లి.. బంధువులను ఆహ్వానించడానికి ఎంతో ఉత్సాహంగా వెళ్లాడు. బంధువులకు పెళ్లి పత్రిక అందజేసి వివాహానికి రావాలని ఆహ్వానించాడు. అనంతరం సొంతూరుకు బయలుదేరాడు. అయితే ఇంతలోనే విధి వక్రీకరించింది. ఆ యువకుడిని రోడ్డు బలితీసుకుంది. దీంతో ఒక్కసారిగా ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలివీ.. ఆత్మకూరులోని వాల్మీకి నగర్‌కు చెందిన కాంతరావు, నాగసుబ్బమ్మ దంపతుల చిన్న కుమారుడు నాగేంద్ర(24) ఈ నెల 30న వివాహం నిశ్చమయింది. బంధువులకు పెళ్లి పత్రికలు ఇచ్చి తిరుగు పయనమయ్యాడు. అయితే మార్గమధ్యంలో కంబాలపల్లి గ్రామ శివార్లలోని కేజీ రోడ్డుపై బైకు, ఓ ఫోర్ వీలర్ ఢీకొన్నాయి. బైక్‌పై వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడి తల్లి పని నిమిత్తం పాములపాడు వచ్చి ఆటోలో తిరిగి వెళ్తున్న సమయంలో రోడ్డుపై పడి ఉన్న యువకుడి మృతదేహాన్ని చూసింది. తన కుమారుడి షర్టు లాగా ఉందని గమనించింది. అక్కడ చనిపోయింది తన కుమారుడే అని నిర్ధారించుకున్న ఆ తల్లి ఒక్కసారికి ఆటో నుంచి దూకి మృతదేహం వద్దకు పరుగెత్తింది. ఆమె రోదిస్తున్న తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పిడుగుపాటుకు యువకుడు..

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామంలో ఆదివారం రాత్రి పిడుగుపాటుకు గురై గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మీనరసింహ(28) మృతిచెందాడు.. గ్రామానికి చెందిన నరసింహ, శేషమ్మ దంపతుల కుమారుడు లక్ష్మీనరసింహ ఆదివారం పొలానికి వెళ్లాడు. రాత్రయినా ఇంటి రాకపోవడం, అలాగే ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లారు. అయితే పొలం గట్టుపై విగతజీవిగా పడి ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి గ్రామానికి వెళ్లి లక్ష్మీనరసింహ మృతికి సంతాపం తెలిపారు. అతడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

తల్లి, భార్య దాడిలో వ్యక్తి..



సుధాకర్ (ఫైల్)

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై తల్లి, భార్యను వేధిస్తుండటంతో ఆదివారం రాత్రి సుధాకర్(34) అతడి తల్లి గోవిందమ్మ, భార్య సుమిత్ర కలిసి కట్టెలతో దాడి చేశారు. దీతో ఆ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రతిరోజు హింసించడంతోపాటు ఆదివారం కూడా హింసించడంతో భయ పెట్టాలనే ఉద్దేశంతో ఇరువురు కలిసి కట్టెలతోదాడి చేశారు. అయితే ఆ దెబ్బలకు తాళలేక మృతి చెందాడు. ఘటన స్థలాన్ని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సోమవారం ఉదయం పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు.. రిమాండ్

డోన్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ బాలికపై లైంగిక దాడి చేసిన పిండిమిషన్ ఓనర్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిండి మిషన్‌కు వెళ్లిన బాలికపై లైంగికదాడి చేయడం చుట్టుపక్కల వారు గమనించి బాలిక తల్లిదండ్రులకు తెలియజేశారు. బాలిక తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు.

ట్రాక్టర్ చోరీ ఘటనపై కేసు నమోదు ..

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిశెట్టిపల్లె గ్రామ సమీపంలోని సాయిరాం రైస్ మిల్లు వద్ద ఈనెల 15న రాత్రి జరిగిన ట్రాక్టర్ చోరీ ఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు తెలిపారు. ఏపీ39ఎన్‌జె 9370 ట్రాక్టర్ రైస్‌మిల్ వద్ద పార్క్ చేసివుండగా ఎత్తుకెళ్లినట్లు బాధితుడు దూదేకుల చిన్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రవాణా శాఖ అవినీతిమయం





నంద్యాల రవాణా శాఖ కార్యాలయం

- ప్రతి పనికి రూ.300 వసూలు?
- అధిక లోడ్ లారీలకు నెలకు రూ.12వేలు డిమాండ్
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- మధ్యవర్తుల ద్వారా వసూళ్లు
- వాహనదారుల ఇబ్బందులు

నంద్యాల టౌన్ ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనకు పారదర్శకతను మించిన గీటురాయి ఉండదు. అది లోపిస్తే అవినితి ఊబిలో యంత్రాంగం కూరుకు పోయినట్లే. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తారాస్థాయికి చేరుకుందనే విమర్శ తీవ్రస్థాయిలో వినిపిస్తోంది. మేం ఇంతే.. అన్న రీతిలో అధికారులు ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే అధికారులు, మధ్యవర్తులు (ఏజెంట్లు) కార్యాలయం చుట్టూ పనుల కోసం తిప్పుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా నంద్యాల జిల్లా రవాణా కార్యాలయం అవినీతికి చిరునామాగా మారిందని అంటున్నారు. ఈ స్థితిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

నంద్యాల జిల్లా రవాణా కార్యాలయంలో ఎన్నిసార్లు ఏసీబీ దాడులు జరిగినా వారిలో మార్పు రావడం లేదు. వాహనదారులను ఇబ్బందులకు గురి చూస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అటెండర్ నుంచి ఉన్నతాధికారుల వరకు అవినీతికి పాల్పడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మొత్తం కంటే అధికారుల ఆదాయమే ఎక్కువగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

జిల్లా రవాణా కార్యాలయంలో ఇలా...

జిల్లాలో నంద్యాల డీటీవో కార్యాలయం, డోన్ ఎంవీఐ, ఆత్మకూరు ఎంవీఐ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలో లారీలు సుమారుగా వెయ్యి నుంచి 1,200 లారీలు ఉన్నాయి. వీటిలో నేషనల్ పర్మిట్ పొందాల్సినవి సుమారుగా 400 ఉంటాయి. వీటిలో ట్యాక్స్ కట్టని వాటికి నంద్యాల ఆర్టీవో కార్యాలయంలో ఒక్కో లారీకి రూ. 16,500 వాహనదారుడు కట్టాలి కానీ, నంద్యాల ఆర్టీవో గత ఏడాది నుంచి వాహనం తిరగ లేదని వాహనదారుడి నుంచి రూ.5300 చొప్పన తీసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

నంద్యాలకు లారీలు హెవీ లోడుతో వస్తుంటాయి. ముందుగానే మధ్యవర్తులు వెళ్లి నెలకు రూ.12000 చెల్లిస్తే నీ వాహనం నంద్యాల జిల్లా పరిధిలో ఎక్కడా పట్టుబడకుండా చూస్తామని ఒక టోకన్ నెంబర్ ఇస్తారు. నంద్యాల ఎక్కువగా తంబరాజు పల్లె నుంచి గ్రావెల్, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, తాడిపత్రి నుంచి ఇసుక లారీలు, జేఎస్ డబ్ల్యూ నుంచి వచ్చే సిమెంట్ లారీలు ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల బనగానలపల్లె, డోన్ నుంచి వచ్చే లారీలు నంద్యాల ఆర్టీవో కార్యాలయానికి నెలకు రూ.12000 ముట్టజెప్పాలి లేని పక్షంలో లారీ యజమాన్ని ముప్పు తిప్పలు పెడతారు.

నంద్యాల రవాణా కార్యాలయంలో రోజుకు లావాదేవీలు 300 దాకా వరకు జరుగుతున్నాయి. వీటికి ప్రతి వ్యవహారానికి రూ.300 వసూలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రవాణా కార్యకాలాపాలన్నీ వేరే పోర్టల్ ద్వారా జరిగేవి. కూటమి ప్రభుత్వం వాహన యాప్ ద్వారా చేయాలని సూచించింది. అయితే వాహనదారులు వాటిని మార్చడానికి మండలం, ఈవేవైసీ, ట్రాన్స్‌ఫర్ అఫ్ ఓనర్ ఇలా జరిగి ప్రతి వ్యవహారానికి అన్ని పత్రాలు ఉన్నా రూ.300 చెల్లించాలి. ఏజెంటు ద్వారా కలెక్ట్ చేసి అధికారులకు పర్సెంటేజీ ప్రకారం పంచుతారు. ఇలా లంచాలు రోజుకు సుమారుగా రూ.1.5 లక్షల్లో వసూలు చేసుకుని పంచుకుంటున్నారు.

రవాణా కార్యాలయంలో జరిగినవి..

- నంద్యాల జిల్లా రవాణా కార్యాలయంలో ఇప్పటికి పలుమార్లు ఏసీబీ అధికారులు దాడులు చేసినా వారిలో ఎటువంటి మార్పులు రాలేదు. గతంలో కొన్నేడ్ల కిందట ఒక ఎంవీఐ వాహనదారుడి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కి జైలుకు వెళ్లాడు.
- గతేడాది ఇక్కడే పని చేసి మరో ఏంవీఐ కర్నూలు రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పని చేస్తూ అక్రమ రవాణ, లంచం తీసుకున్న కేసులో ఏసీబీకి చిక్కి జైలు పాలయ్యాడు.
- గతేడాది నంద్యాల ఆర్టీవో కార్యాలయంలో పని చేస్తున్న ఏవో అక్రమ ఆస్తుల కేసులో ఏసీబీకి చిక్కి జైలుకు వెళ్లారు. అయినప్పటికీ వీరిలో మార్పు రావడం లేదు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- గతంలో ఇక్కడ పని చేసిన క్లర్క్ రూ.2,500లు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఆయన ప్రస్తుతం ఆదే కార్యాలయంలో పని చేస్తుండడం గమనార్హం.



రవాణా అధికారులు సీజ్ చేసిన వాహనాలు

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

నంద్యాల డీటీసీ కార్యాలయ పరిధిలో వాహనదారులు ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే ఎక్కువగా చెల్లించాల్సిన అవసరం లేదు. అధికారులు ఎవరైనా అలా అడిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వాహనదారుకుల కూడా పరిమితి మించిన లోడుతో వెళ్లరాదు. **- కృష్ణవేణి, జాయింట్ టాన్స్‌పోర్ట్ కమిషనర్**

కిరాణ దుకాణం దగ్ధం



పెద్దతుంబళంలో కాలి బూడిదైన సామగ్రి

ఆదోని రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతుంబళంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. హోల్‌సేల్, రిటైల్ కిరాణ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి దుకాణం మొత్తం కాలిపోయింది. వివరాలివీ.. హజ్రత్ ఫారూక్ కిరాణ దుకాణాన్ని జాండే ఫారూక్ నడుపుతున్నారు. ఆదివారం రాత్రి 10గంటలకు దుకాణం బంద్ చేసి యజమాని ఇంటికెళ్లిపోయారు. కొద్దిసేపటికే దుకాణం లోనుంచి పొగలు రావడంతో స్థానికులు యజమానికి ఫోన్ చేశారు. అంతలోపే దుకాణంలో మంటలు దవానంలా వ్యాపించి పెద్ద ఎత్తున చెలరేగాయి. రాత్రి 11గంటల సమయంలో అగ్నిమాపక అధికారులు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. దుకాణంలో మంచినూనె డబ్బాలు ఉండడంతోనే మంటలు భారీ ఎత్తున చెలరేగాయని, బియ్యం బస్తాలు ఇతర సామాగ్రీ మొత్తం ఖాళీ బూడిదైందని, దాదాపు రూ.30లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేష్ బాబు తెలిపారు.

గడ్డివామి..



ఆలూరులో దగ్ధమైన గడ్డివామి

ఆలూరు రూరల్: చెరువుకట్ట ఆవరణలో ఉన్న కోట వీధికి చెందిన రైతు వీరేష్‌కు చెందిన గడ్డివాము సోమవారం దగ్ధమైంది. గడ్డివామి చుట్టూ మంటలు చెలరేగడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సర్పంచ్ అరుణాదేవి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్ అగ్నిమాపక కేంద్రానికి మళ్లీ సమాచారం ఇచ్చారు. సిబ్బంది స్థలానికి చేరుకొని వాహనంలోని మోటార్ మరమ్మతుల కోసం ఇతర ప్రాంతానికి పంపామని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని చెప్పారు. అనంతరం ఆదోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలి బూడిద అయిందని తెలిపారు. 1.50 లక్షలు విలువ చేసే గడ్డివామి కాలిపోయిందని, ఆదుకోవాలని బాధితుడు కోరారు.

బస్సును ఆపి యువకుల హల్‌చల్

- మద్యం మత్తులో కండక్టర్, ప్యాసింజర్‌పై దాడికి యత్నం
- కేసు నమోదు చేసిన పోలీసులు

సంజామల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నొస్సం గ్రామంలో మద్యం మత్తులో బస్సును ఆపి యువకులు హల్‌చల్ చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రొద్దుటూరు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు కర్నూలు నుండి ప్రొద్దుటూరుకు వెళుతుండగా మార్గమధ్యంలో నొస్సం బస్‌స్టాప్ వద్ద గ్రామానికి చెందిన భరత్ అనే యువకుడు మద్యం మత్తులో బస్సును ఆపి ప్యాసింజర్, కండక్టర్‌పై దాడికి యత్నించారు. గ్రామస్థులు కలిసి బస్సును పంపించారు. బస్సు గ్రామ సమీపంలోని రైల్వే వంతెన వద్దకు చేరుకోగానే భరత్, అల్లూరి రమేష్ బాబు ఇరువురు కలిసి రాడ్లు తీసుకొని గంటపాటు బస్సును నిలిపారు. సహనం కోల్పోయిన కండక్టర్ శాంత కుమారి సంజామల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి బస్సును గమ్యానికి చేర్చారు. నిందితుల కోసం గాలించగా రమేష్ బాబు సాయంత్రం దొరికాడు. అతడిని జీపులో ఎక్కించుకొని దేహశుద్ధి చేశారు. గాయాలకు గురైన రమేష్ బాబు కడప జిల్లా జమ్మలముడుగు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సంజామల ఎస్.ఐ రమణయ్య ఆ ఇరువురిపై కేసు నమోదు చేశారు.

అహోబిలం గేట్ ఇన్‌చార్జిపై చర్య

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అహోబిలంలోని ఎల్‌ఏ గేట్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న ఎస్ ప్రసాద్‌ను సోమవారం సస్పెండ్ చేస్తూ దేవస్థానం మేనేజర్ మాధవన్ తెలిపారు. దిగువ అహోబిలం గేటు ఇన్‌చార్జి ఉంటు విధులకు గైర్‌హాజర్ కావడంతో సంజాయిషీ అడిగామన్నారు.

దీంతో ప్రసాద్ సంజాయిషీ నోటీసును తీసుకోక పోవడంతో శ్రీమఠం శ్రీకార్యము ఉత్తర్వుల మేరకు సస్పెండ్ చేసి నట్లు వివరించారు.

పెద్దపులి దాడిలో ఆవు మృతి

- పాల కోసం లేగదూడ తాపత్రయం



తల్లి వద్ద పాలకోసం లేగదూడ ఎదురుచూపులు

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లకాల్వ గ్రామ శివార్లలోని ఓ పొలంలో ఉన్న ఆవుల మందపై సోమవారం తెల్లవారుజామున ఓ పెద్దపులి చేసిన దాడిలో ఓ ఆవు మృతి చెందింది. వివరాలివీ.. గ్రామ శివార్లలోని కలీముల్లాకు చెందిన పొలంలో రైతు శంకర్‌కు చెందిన ఆవుల మందను కట్టి వేసి వెళ్లారు. అయితే సోమవారం తెల్లవారు ఝామున అకస్మాత్తుగా ఆ ఆవుల మందపై పెద్దపులి దాడి చేసి ఓ ఆవును తీవ్రంగా గాయ పరిచింది.

ఆవుల అలికిడికి అక్కడే ఉన్న పశువుల కాపరులు అప్రమత్తమై కేకలు వేయడంతో ఆ పెద్దపులి అడవిలోకి పారి పోయింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆవు అక్కడికక్కడే మృతి చెందిందని గ్రామస్థులు తెలిపారు. ఇదిలా ఉంటే ఉదయం తల్లి పాలకోసం ఆ ఆవుకు చెందిన లేగదూడ పడుతున్న పాట్లు గ్రామస్థులను కలచి వేసింది. అటవీ అధికారులు వివరాలు సేకరించారు.

ముంచిన గాలివాన

- నేలకొరిగిన మునగ చెట్లు
- రాలిపోయిన మామిడికాయలు
- ఆందోళనలో అన్నదాతలు



తరిగోపుల గ్రామంలో కూలిన మునగచెట్లు



రాలిన మామిడికాయలను చూపుతున్న రైతులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి గాలివాన బీభత్సానికి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తరిగోపుల గ్రామానికి చెందిన గుండిచంద్రుడు అనే రైతుకు చెందిన 1.25 ఎకరాల్లో సాగుచేసిన మునగచెట్లన్నీ నెలకొరిగాయి. రూ.1లక్ష వరకు పెట్టుబడి పెట్టిన చేతికొచ్చే సమయంలో పడిపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవిస్తున్నారు. అదే గ్రామంలో మంగన్న అనే రైతుకు చెందిన నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మామిటితోటలో గాలివానకు మామిడికాయలు రాలిపోయాయని, రూ.1.50 లక్షల నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తంగడంచ గ్రామంలో ఆరబెట్టిన మొక్కజొన్నగింజలు వానకు తడిసినట్లు రైతులు తెలిపారు. ఆదివారం సాయంత్రం గాలివానకు చెట్లుపడటంతో విద్యుత్ సరఫరాకు రెండు గంటల పాటు తీవ్ర అంతరాయం కలిగింది. మండలంలో మొత్తం 44.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

వైభవంగా పల్లకీ సేవ

మహానంది, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీ ఉత్సవాన్ని ఆలయ వేదపండితులు, అర్చకులు వేదమంత్రోచ్ఛరణతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ఆశీనులుజేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదమంత్రాలతో ఆలయ మెదటి ప్రాకారంలో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సబ్బారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆది దంపతులకు వెండి రథోత్సవం



వెండి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులుజేశారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా సోమవారం విశాఖపట్నానికి చెందిన శ్రీనివాసమూర్తిచే శివతత్త్వంపై ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

మహానందిలో బడబానల బసప్ప



మహానందికి చేరిన బడబానల బసప్ప

మహానంది, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సమీపంలోని పెరుమ గొంగళిలోని ప్రతిగింర మహాకాళి బసవ సంపూర్ణ క్షేత్ర మఠానికి చెందిన బడబానల బసప్ప వృషభం సోమవారం రాత్రి ప్రత్యేక ఏసీ వాహనంలో మహానందికి చేరుకొంది. నంద్యాల, కర్నూలు ఉమ్మడి జిల్లాలోని క్షేత్రాల్లో బడబానల బసప్ప దర్శనం కల్పించాలన్న ఉద్దేశంతో మహానందికి తీసుకొచ్చినట్లు గురువు వాసిదేవ శారణి తెలిపారు. అయోధ్యలో రామదర్శనం చేసుకొన్న ఏకైక బసవప్ప అని చెప్పారు. ఇటీవల జరిగిన ప్రయాగరాజ్ కుంభమేళలో కూడా బడబానల బసప్ప వృషభం పాల్గొని నాగసాధువులతో పాటు కుంభమేళా పుణ్య స్నానాలు చేసిందని చెప్పారు. మహానందిలో దర్శనం పూర్తయిన తర్వాత శ్రీశైలం క్షేత్రం చేరి మల్లికార్జున స్వామిని దర్శించి అక్కడి నుంచి మంగళవారం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి వెళ్తామని గురువు తెలిపారు. కార్యక్రమంలో మఠం సహాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి నరసింహులు, నంద్యాల డివిజన్ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, అఖిలభారత రైతు సంఘం, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

నంద్యాల రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని హరిజనవాడలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభానికి 38 వార్డు ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు రూ.10 వేలు విరాళం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

వాహనాల తనిఖీ

కొత్తపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామ శివారులో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు లైసెన్సులు, సరైన వాహన ధృవపత్రాలు లేకుండా వాహనాలను నడపకూడదని ఎస్ఐ జయశేఖర్ సూచించారు. ద్విచక్ర వాహనదారులు లైసెన్సు కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఆటోలు, కార్లు ఇతర భారీ వాహనాలు నడిపే వాహనదారులు లైసెన్సుతో పాటు అన్ని రకాల ధృవపత్రాలు కలిగి ఉండాలన్నారు.

అమెరికాతో ఒప్పందాలను రద్దు చేయాలి

● వామపక్షాలు, రైతు, కార్మిక సంఘాల నిరసన



నంద్యాలలో నిరసన తెలుపుతున్న నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని వ్యవసాయ, పాడిపరిశ్రమ, మత్స్య రంగాలకు నష్టాలను కలిగించేలా అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు డిమాండ్ చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ జేమ్స్ భారత పర్యటనను వ్యతిరేకిస్తూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భారత ఎగుమతి, దిగుమతు లపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా సుంకాలు విధించడం సరికాదని అన్నారు. భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన సుంకాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు ఉన్నారు.

నంద్యాల రూరల్: భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులపైన అమెరికా విధిస్తున్న సుంకాలను తగ్గించాలని, భారత ప్రధాని మోదీ, ట్రంప్ మధ్య జరిగిన ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సాయిబాబానగర్ సర్కిల్‌లో ఏపీ రైతు సంఘం, కార్మిక, వ్యవసాయ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ ట్రంప్‌తో ప్రధాని మోదీ చేసుకున్న ఒప్పందం మేరకు దేశ అభివృద్ధిని సైతం మరచిపోతున్నారని, మనదేశ సంపదను అమెరికాకు కొల్లగొట్టడానికి అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తోట మద్దులు, నరసింహ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ భారత్ పర్యటనకు వస్తున్న సందర్భంగా వ్యతిరేకిస్తూ నందికొట్కూరు పట్టణంలో వామపక్షాల నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని ర్యాలీ నిర్వహించి అమెరికా ఉపాధ్యక్షుడు గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, రాజు, పక్కీరసాహెబ్, గోపాలకృష్ణ, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై హర్షం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అభ్యర్థులు

ఆత్మకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఆత్మకూరులోని గౌడ్‌సెంటర్ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు డీఎస్సీ అభ్యర్థులు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వస్సీల్ మున్నా మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ హయాంలో డీఎస్సీకి సంబంధించి ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయకుండా నిరుద్యోగులకు మాజీ సీఎం జగన్ తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని విడుదల చేస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మానవ వనరుల శాఖ మంత్రి నారాలోకేష్ ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. జనసేన నాయకులు అరుణ్‌కుమార్, అసదుల్లా, ఫరీద్, టీడీపీ నాయ కులు అలిహుసేన్, నబిరసూల్, సలాం, జలీల్, అబ్దుల్‌హుసేన్ తదితరులు ఉన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్తూరు గ్రామంలో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యకర్తలకోసం అహర్నిశలు పని చేస్తున్నారని అన్నారు. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసమే పనిచేస్తున్నారని అన్నారు. నాయకులు హనుమంతరెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సోమవారం సాయంత్రం స్థలవివాదంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ రాము తెలిపిన వివరాలివీ.. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఎస్సీ వర్గానికి చెందిన ఇరు వర్గాలు గ్రామ శివార్లలో తమకు ప్రభుత్వం కేటాయించిన 3 సెంట్ల స్థలం తమదంటే తమదంటూ ఘర్షణకు దిగారు. ఒకే పార్టీకి చెందిన ఇరు వర్గాల మధ్య వాగ్వావాదం చోటు చేసుకుని పరస్పరం దాడులకు దిగారు. కర్రలు, ఇనుపరాడ్లు,రాళ్ళతో దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా పలువురికి గాయాలయ్యాయి. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు సీఐ రాము పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదర గొట్టారు. అనంతరం తీవ్ర గాయాల పాలైన వారిని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరు వర్గాల వారిలో ఒక వర్గం వారిని అక్కడ కూడా తగాదా పడకుండా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో కూడా తీవ్రగాయాల పాలైన ఇరువురిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన ఇరు వర్గాలకు చెందిన నాగశేషులు, రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసులు దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

'మాదిగలకు 7శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి'

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు 7శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు అన్యాయం జరిగిందని సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా దండు వీరయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో రోస్టర్ విధానాన్ని సవరించి మాదిగలకు 7శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, వర్గీకరణకు అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాజకుమారికి వారు వినతిపత్రం అందజేశారు.

క్రికెట్ విజేత ఆత్మకూరు జట్టు

కొత్తపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి నిర్వహించిన క్రికెట్ పోటీల్లో మొదటి విజేతగా ఆత్మకూరు ఏషియన్ జట్టు విజయం సాధించినట్లు క్రీడా నిర్వాహకులు రాజేష్ జనసేన మండల నాయకులు ప్రవీణ్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మండలంలోని శివపురం గ్రామంలో ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఎస్సీ కాలనీ పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఈ నెల 12వ తేదీన నిర్వహించినట్లు తెలిపారు. ఆత్మకూరు జట్టు మొదటి బహుమతి రూ.30వేలు, రన్నర్‌గా నిలిచిన శివపురం ఎస్సీ కాలనీ టీంకు రూ.20వేల నగదు దక్కించుకుంది. గెలిచిన క్రీడాకరులకు సంఘ పెద్దలువిజయకుమార్, ఏసన్న, పుల్లన్న, ఫక్కీరయ్య బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు సురేష్, ప్రేమ్, అవోక్, సాయి పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని కరివేన గ్రామంలో కరివేన సతఃఎస్ఐ సంఘ పెద్దలు, గ్రామ యూత్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర స్థాయి పాలబండ లాగుడు పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో ఆరు జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూలుకు చెందిన మొదటి బహుమతిగా వెంకటేశ్వరరావు ఎద్దులు రూ.50 వేలు కైవసం చేసుకోగా, రెండో బహుమతి రేమటకు చెందిన గిడ్డయ్య నాయుడు ఎడ్లు రూ.40 వేలు, మూడో బహుమతి కొత్తపల్లికి చెందినవెంకట హరికృష్ణ ఎద్దులు రూ.30 వేలు గెలుచుకున్నాయి. అలాగే మంగ పేటకు చెందిన వీరాంజనేయులు ఎద్దులు నాలుగో బహుమతిగా రూ.20 వేలు, రుద్రవరం గ్రామానికి చెందిన గోపాల్ గౌడ్ ఎద్దులు ఐదో బహుమతిగా రూ.15 వేలు, ఎ.కోడూరు గ్రామానికి చెందిననాగేశ్వరరెడ్డి ఎద్దులు ఆరో బహుమతిగా రూ.10 వేలు దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీరికి దాతలు సీఎస్ఐ సంఘ పెద్దలు విజయ్‌కుమార్, జయన్న, రమేష్, కిరణ్‌కుమార్ సహకారంతో ఆయా బహుమతులను అందజేసినట్లు సీఎస్ఐ సంఘ పెద్దలు వెల్లడించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

'పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలి'



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి

పాణ్యం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని, వంద శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు ఉద్యాన వన శాఖ అధికారి దివ్య, ఏపీవో శేషన్న సూచించారు. సోమవారం పాణ్యం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ సిబ్బంది సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని లబ్ధిదారులను గుర్తించి 200 ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. చీని, మామిడి, సపోటా, జామ, నిమ్మ, నేరేడు, ఆయిల్ పామ్, సీతాఫలం, మునగ, మల్లె, గులాబి సాగుకు లబ్ధిదారులు ఐదెకరాలు కలిగి ఉండాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన రుబతులకు వంద శాతం సబ్సిడీతో పండ్ల తోటలు, పూల తోటలు పెంచుకోవచ్చన్నారు. ఐదెకరాలు మించిన రైతులు తోటల్లో నాటుకున్నట్లయితే హెక్టార్‌కు 40 శాతం సబ్సిడీ ఆయిల్‌పాం నాటుకున్న రైతులకు 75 వేల వరకు సబ్సిడీ చేకూరుతుందన్నారు. ఏపీ ఎంఐపీ ద్వారా డ్రిప్పు, స్రింక్లర్స్ ను ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం ఐదెకరాలకు, 90 శాతం ఐదెకరాలకు ఎక్కువ సాగు చేసే రైతులకు వర్తిస్తుందన్నారు. ఇతరులకు 50 శాతం సబ్సిడీ చేకూరుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీఏలు, ఎఫ్ఏలు, రైతు సేవా కేంద్రం సహాయకులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి'

మిడుతూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో దశరథ రామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈవో ఫైజున్నిసా అన్నారు. మిడుతూరులో ఐదు అంగన్‌వాడీ కేంద్రాలలోని ఐదు సంవత్సరాలు పూర్తి అయిన విద్యార్థులను ప్రీ స్కూల్ సర్టిఫికెట్‌లతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల వరలక్ష్మి, రేణుకాదేవి ఆధ్వర్యంలో మిడుతూరు ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం శాంతి సమక్షంలో చేర్పించారు. మండ లంలో 43 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 212 మంది విద్యార్థులను అంగన్‌వాడీ టీచర్లు ఆయా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో హెచ్ఎంల సమక్షంలో చేర్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా చదువు బోధన, మౌలిక వసతుల కల్పన ఉందని సూపర్ వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ పాఠశాలల్లో ఐదేళ్లు పూర్తైన చిన్నారులను సోమవారం ఆయా గ్రామాల్లోని ప్రాభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశం చేయించారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వీఆర్వో కుర్చీలో వైసీపీ నాయకుడు



వీఆర్వో కుర్చీలో కూర్చున్న వైసీపీ నాయకుడు అశోక్‌రెడ్డి

మహానంది, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సబ్బసాని అశోక్‌రెడ్డి సోమవారం మహానంది తహసీల్దార్ కార్యాలయానికి తన సొంత పనిమీద వచ్చారు. తహసీల్దార్ రమాదేవి కోర్టు పనిమీద నంద్యాల్లో ఉండి పోవడంతో పక్కనే ఉన్న మండల వీఆర్వోల చాంబర్‌లోకి వెళ్లారు. వీఆర్వో కూర్చొనే కుర్చీలో వీఆర్వోను నిలబెట్టి దర్జాగా వారి కుర్చీలో వైసీపీ నాయకుడు అశోక్‌రెడ్డి కుర్చొని మాట్లాడే దృశ్యం సర్వత్ర చర్చాంశనీయంగా మారింది. అధికారం కోల్పోయినా కూడా వైసీపీ నాయకుడు తన అధికార దర్పణం ప్రదర్శించడం సర్వత్రా చర్చాంశనీయంగా మారింది. వైసీపీ ప్రభుత్వ పాలనలో మట్టి మాఫియాగా గుర్తింపు పొందిన అశోక్‌రెడ్డికి మహానంది రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు నిలబడి కూర్చీలు వేసి మాట్లాడటం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. తహసీల్దార్‌ను వివరణ కోరగా వీఆర్వో కుర్చీలో వైసీపీ నాయకుడు కుర్చోవడం ముమ్మటికీ తప్పే అన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి



అధికారులతో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

వెలుగోడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ ఆయకట్టు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేసీ కెనాల్ ప్రాజెక్టు చైర్మన్ రామలింగారెడ్డి అన్నారు. సోమవారం ఆయన కేసీ కెనాల్ సీఈ కబీర్‌బాషా, ఈఈ ప్రతాప్, డీఈ రవికుమార్, ఏఈ మహేశ్వరరెడ్డితో కలసి రేగడగూడూరు సమీపంలోని కేసీ కెనాల్ నిప్పులవాగులను ఆయన పరిశీలించారు. కేసీ కెనాల్ వెంట చేపట్టిన పనులను పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అన్నారపు శేషిరెడ్డి, మాజీ ఎంపీపీ రామసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మద్దూరు తిమ్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతులు నమోదు చేసుకోవాలి

బండిఆత్మకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జొన్న పంట పండించిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో అమ్మకం కోసం పేర్లు నమోదు చేయించుకోవాలని ఏవో స్వాతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పౌరసరఫరా శాఖ ద్వారా క్వింటం రూ.3371 చొప్పున నాణ్యత ప్రమాణాల ఆధారంగా కొనుగోలు చేస్తారని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వక్ఫ్ సవరణ చట్టంపై రాజకీయం: ఎంపీ

నంద్యాల మున్సిపాలిటీ/ నంద్యాల రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలకు ఎలాంటి నష్టం లేదని, కొందరు రాజకీయం చేస్తున్నారని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ముస్లిం ఆస్తులను ఆక్రమించిన బడాబాబుల అంతు తేల్చాడానికే ప్రధాని మోదీ వక్ఫ్ సవరణ చట్టం తెచ్చారని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో కలిసి తమ సమస్యలు చెప్పుకున్న దివ్యాంగులు, హిజ్రాలు తదితరులకు న్యాయం చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతూ ఎంపీ కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేశారు.

ఆస్తులను వైసీపీ నాయకులు లాగేసుకున్నారు..

● ఎంపీ శబరికి మహిళ ఫిర్యాదు



ఎంపీకి ఫిర్యాదు చేస్తున్న గౌరి

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తన ఆస్తులను వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారని గౌరి అనే ఓ మహిళ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరితో పాటు మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తాను కుటుంబ సమేతంగా కర్నూలులో ఉంటున్నానని చెప్పారు. నేను స్థానికంగా లేనని ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరు గ్రామంలో పొలం నంద్యాలలో ఉన్న కొంత స్థలాన్ని వైసీపీ నాకులు కుట్రపన్ని తమకు దక్కకుండా చేశారని కన్నీటి పర్యంతమయ్యారు. తనకు న్యాయం చేయాలని ఎంపి బైరెడ్డి శబరిని వేడుకోగా న్యాయం చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలి

నంద్యాల రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కరోనా కారణంగా రద్దైన రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ కోరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎంపీ బైరెడ్డి శబరికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డోన్, నంద్యాల మీదుగా నడిచే ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాముడు, సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు సమయం ఇవ్వాలి

నంద్యాల రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు కనీసం మూడు నెలల సమయం ఇవ్వాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు ఎవరూ నష్టపోకుండా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ అయినా జిల్లా అభ్యర్థులందరూ ఒకే పేపర్ రాసేలాగా చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

వక్ఫ్ సవరణను ఉపసంహరించుకోవాలి



ఆత్మకూరులో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, అప్పటి దాకా పోరాటం సాగిస్తామని ఆత్మకూరు వక్ఫ్ పరిరక్షణ జేఏసీ నాయకులు ముఫ్తి నూర్‌మహ్మద్, మౌలానా రహంతుల్లా, మౌలానా జబీవుల్లా, ముఫ్తి అల్తాఫ్ హుసేన్ తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం ఆత్మకూరులోని కొత్తపేట పెద్ద మసీద్ నుంచి ముస్లింలు జాతీయ, నల్లజెండాలను చేతబూని నంద్యాల టర్నింగ్, కేజీరోడ్డు మీదుగా గౌడ్‌సెంటర్‌కు భారీ ర్యాలీగా చేరుకున్నారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు కూడా వక్ఫ్ సవరణ చట్టానికి ఇచ్చిన మద్దతును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అక్కడ డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, అర్బన్ సీఐ రాము నేతృత్వంలో భారీ పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టారు.


శక్తి యాప్‌పై అవగాహన

నంద్యాల క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శక్తియాప్, పోక్సో చట్టం, మహిళల అత్యవసర నంబర్లపై సోమవారం పోలీస్ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈవ్‌టీజింగ్ నియంత్రణకు డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. శక్తియాప్‌ను మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉంచుకుంటే ఆపద సమయాల్లో రక్షణగా పనిచేస్తుందని చెప్పారు. ముఖ్యమైన కూడళ్లు, విద్యాసంస్థలు, షాపింగ్‌మాల్స్, ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్తూరు లక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చిన ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. మొత్తం రూ. 11,21,770 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి సాయికుమార్ తెలిపారు. హుండీ లెక్కింపు తనిఖీ అధికారి హరిచంద్రాఎడ్డి పరిశీలించారు. గతేడాదికంటే రూ.42వేలు ఆదాయం తగ్గినట్లు చెప్పారు. హుండీ లెక్కింపులో బాలాజీ సేవాసంస్థ స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'గురురాజా'లో ఘనంగా అవార్డు ఫెస్ట్ - 2025



అవార్డులు పొందిన విద్యార్థులతో దస్తగిరిరెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎన్జీవో కాలనీలోని శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అవార్డు ఫెస్ట్-2025ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ షేక్షావలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గురు రాఘవేంద్రా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి, డాక్టర్ జి.రవికృష్ణ, మౌలాలిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను నేషనల్ స్టేట్ లెవల్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన 85 మంది విద్యార్థులకు జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. సీవీ రామన్ సైన్స్ ఒలింపియాడ్, యూనిఫైడ్ కౌన్సిల్ మ్యాచ్ ఒలంపియాడ్ తదితర టెస్ట్‌ల్లో 14 మంది విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ అవార్డు ప్రదానం చేశారు. అలాగే జాతీయ, రాష్ట్రస్థాయిల్లో వివిధ క్రీడల్లో రాణించిన 25 మంది విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతో పాటు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి

చాగలమర్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగుకు గ్రామాల్లో రైతులను ప్రోత్సహించాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 16 రకాల పండ్ల తోటలను వందశాతం సబ్సిడీతో రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఐదుఎకరాల్లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఉపాధిహామీ పథకం కింద అర్హులని పేర్కొన్నారు. 2025-26 సంవత్సరానికి పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీవో ఖాసీంసాహేబ్, హార్టికల్చర్ సహాయ అధికారి ఫరూక్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

చాగలమర్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో అకాల వర్షంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. రెండు రోజుల క్రితం పెనుగాలుల బీభత్సంతో చిన్నవంగలి, పెద్దవంగలి గ్రామాల్లో కోతకు వచ్చిన బొప్పాయి కాయల చెట్లు విరిగిపడి రైతులకు నష్టం వాటిల్లింది. అలాగే పెద్దవంగలి, ఎం.తండా, ముత్యాలపాడు గ్రామాల్లో కోతకు వచ్చిన మామిడి కాయలు నేలవాలి దెబ్బతిన్నాయి. నేల రాలిన మామిడి కాయలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

భూసార పరీక్ష శ్రీరామరక్ష

రుద్రవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : భూమికి భూసార పరీక్ష శ్రీరామరక్ష అని ఏవో సుమతి అన్నారు. సోమవారం 16 రైతు సేవాకేంద్రాల సిబ్బందికి భూసార పరీక్షపై అవగాహన కల్పించారు. 2025-26 సంవత్సరానికి 1151 మట్టి నమూనాలు సేకరించాల్సి లక్ష్యం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, వీఏఏలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆలమూరు, చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామాల్లో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియా పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆయా గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బదిన్న పంటలను ఆమె పరిశీలిస్తారన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొనిపోయి న్యాయం చేస్తారని వివరించారు.

పుస్తకాల పంపిణీ

బనగానపల్లె, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ రాజిక సత్యప్రపూర్ణ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలు పంపిణీ చేశారు.

రేపటి నుంచి ఆరాధనోత్సవాలు

డోన్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమీపంలో వెలసిన పోలికి వర చిదంబర స్వామి ఆరాధన మహోత్సవాలు ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, వక్తలచే సత్సంగ కార్యక్రమం, అఖండ భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ ఆరాధనోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన బోధన

దొర్నిపాడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యాబోధ నను అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. సోమవారం మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో ఐదేళ్లు దాటిన ఏడుగురు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించినట్లు అంగన్‌వాడీ టీచర్ తులసీ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో విద్యాబోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ

కోవెలకుంట్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉందని రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె, సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన సుమారు 200మంది రైతులకు వివిధ వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందనే ఆలోచనతో వ్యవసాయ యంత్రీకరణ పరికరాలు సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. ఈ పంట నమోదు చేసుకోకంటే ప్రకృతి వైపరీతల్యాలు సంభవించినప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఖచ్చితంగా ప్రతి ఒక్క రైతు ఈపంట నమోదు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా రైతులతో వ్యవసాయ సాగులో మెళకువల గురించి కొంత మంది రైతులతో మాట్లాడించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ, నంద్యాల ఏడీ రాజశేఖర్, కోవెలకుంట్ల ఏడీ సుధాకర్, ఐదు మండలాల ఏవోలు, కో వెలకుంట్ల మాజీ సింగి ల్‌విండో అధ్యక్షులు గు వ్వల సుబ్బారెడ్డి, మా జీ మార్కెట్‌యార్డు చైర్మ న్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, సౌదరదిన్నె సుబ్బారెడ్డి, వల్లంపాడు సర్పంచ్ జగ దీశ్వర్‌రెడ్డి, కలుగొట్ల అ ర్జున్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు అమడాల మద్దిలేటి, ఎంపీడీవో రమణ మూర్తి, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌యార్డు సెక్రటరీ నా రా యణస్వామి, లింగాల నాయుడు, చిన్న కొప్పెర్ల బుచ్చన్న, అధికారులు పాల్గొన్నారు.



రైతులకు సబ్సిడీ యంత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ

పలు ప్రభుత్వ కార్యాలయాల్లో తనిఖీ

పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. సచివాలయం-5, డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయం, హెల్త్ సెంటర్లను తనిఖీ చేశారు. విధుల్లో బాధ్యతారాహిత్యంగా ఉన్న అధికారుల పై మంత్రి మండిపడ్డారు. విధులకు హాజరవుతున్న అధికారుల వివరాలు పరిశీలించారు. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో బాధ్యతగా మెలగాలని, తమకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించి ప్రజలకు జవాబుదారీగా నిలవాలని ఆయా అధికారులకు మంత్రి సూచించారు. హెల్త్‌సెంటరు-2ను పరిశీలించిన అనంతరం అక్కడి అపరిశుభ్రతపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రోగులకు స్థానికంగా అందిస్తున్న సేవల పై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. మండలంలో భూసర్వే జరుగుతున్న తీరుపై స్థానిక తహసీల్దారు పవన్‌కుమార్‌ను ఆరా తీసి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో వర ప్రసాదరావు, తహసీల్దారు పవన్, సీఐ హనుమంతనాయక్, ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి, సంజామల ఎస్ఐ రమణయ్య, రేవనూరు ఎస్ఐ భూపాలుడు, వెలుగు ఏపీయం శేఖర్, ఉపాధి హామీ పథకం ఏపీవో శ్రీకళారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

ప్యాపిలి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని సీతమ్మతండా ఆశ్రమ పాఠశాలకు ఆ గ్రామ నివాసి ట్రెజరీ ఉద్యోగి లక్ష్మానాయక్ రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ పాఠశాలలో లక్ష్మానాయక్ సేవలు అభినందనీయమన్నారు. దాతలు విద్యాభివృద్ధికి తమ వంతు సాయం అందించాలని సూచించారు. ఎమ్మెల్యే పిలుపుతో టీడీపీ సీనియర్ నాయకుడు వై లక్ష్మీనారాయణ యాదవ్ పాఠశాలకు రూ.10వేలు విరాళం అందించారు. అలాగే మరో టీడీపీ నాయకుడు అలేబాదు పరమేష్ తమ వంతుగా మైక్‌సెట్ విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు వడ్డె మహరాజ్, ఆలా మోహన్, క్రిష్ణానాయక్, పరమేష్‌నాయక్, రవీంద్ర, రామోజీ, తిరుపాల్‌నాయక్, పాఠశాల హెచ్ఎం పద్మావతి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బేతంచెర్లలో ఫార్మర్స్ పరివారం మార్ట్ ఏర్పాటు

బేతంచెర్ల: ప్రజలకు సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉండేలా ఫార్మర్స్ పరివారం మార్టును ఏర్పాటు చేయడం అభినందనీయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం బేతంచెర్ల పట్టణంలోని అమ్మవారిశాల సమీపంలో ప్రభుత్వ అనుసంధానంగా ఫార్మర్స్ పరివార్ మార్టును జ్యోతి ప్రజ్వలన చేసి ఎమ్మెల్యేతో పాటు మార్టు ఎండీ సాయి జోష్ణ ప్రారంభించారు. మార్టు నిర్వహకులు ఏర్పాటు చేసిన చిన్నారుల కోలాటం చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మార్టు చైర్మన్ అంజయ్య, సీఈవో సురేష్‌బాబు, డైరెక్టర్ సోల్మాన్ రాజు, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, తిరుమల చౌదరి, రూబెన్, మేకల నాగరాజు, కార్యకర్తలు, ఫార్మర్స్ పరివార్ మార్టు నిర్వహకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కోట్లకు విరాళం అందిస్తున్న లక్ష్మీనారాయణ యాదవ్

సమన్వయంతోనే విజయవంతం

బనగానపల్లె, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం విజయవంతం కావాలంటే అన్ని శాఖల సమన్వయంతోనే సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలోని పొదుపు భవనంలో ప్రకృతి వ్యవసాయ సమన్వయ సమావేశం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులకు నవ ధాన్యాల కిట్లను జిల్లా వ్యవసాయాధికారి పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తుల కోసం గ్రామస్థాయిలో పెరటితోటలు, ఏటీఎం, ఏ-గ్రేడ్ మోడల్స్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. నంద్యాల డివిజన్ సహాయ సంచాలకు రాజశేఖర్ మాట్లాడుతూ పంటల వైవిధ్యం, ఈ పంట, సోషల్ ఆడిట్ ప్రాధాన్యతను వివరించారు. సెర్ప్‌ఏపీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ఖరీఫ్ ప్రణాళిక విజయవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉందని ఏవోలకు సూచించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజరు సురేంద్రరెడ్డి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ దశలు, అవసరం ప్రాముఖ్యతను వివరించారు. కేవీకే శాస్త్రవేత్త బాలరాజు మాట్లాడుతూ సంవత్సరం కాలం పంటల ప్రాముఖ్యత, పర్యావరణ, ఆరోగ్య పరిరక్షణ అంశాలను వివరించారు. మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ప్రకృతి పద్ధతిలో ఉత్పత్తి చేసిన పంటలతో తయారు చేసిన భోజనాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో అదనపు జిల్లా ప్రా జెక్టు మేనేజరు అబ్దుల్ సలాం , ఎన్ఎఫ్ఏ రవీంద్ర, రామకృష్ణ, వ్యవసాయాధికారి, అనుబంధ శాఖలు, వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ

సారా ఊట ధ్వంసం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారీ కేంద్రాలు, విక్రయాలపై సోమవారం పలుచోట్ల విస్తృత దాడులు నిర్వహించినట్లు బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి, ఎస్ఐలు కమలాకర్, నాగరాజు సోమవారం తెలిపారు. కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లోని పలు గ్రామాలలో దాడులు నిర్వహించి 2000లీటర్లు నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలోని మీర్జాపురం గ్రామానికి చెందిన చిన్నయ్య అనే వ్యక్తి నుంచి సారా స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

శ్రీకృష్ణ మందిరంలో గీతా పారాయణం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో సోమవారం బహుళాష్టమి పురస్కరించుకొని గీతా పారాయణం నిర్వహించినట్లు ఆలయ నిర్వా హకులు శివారెడ్డి తెలిపారు. ఆధ్యాత్మిక వక్త వైవీఎస్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కంప్యూటర్ శిక్షణ పొందాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతో పాటు కంప్యూటర్ శిక్షణ పొందాలని ఎంఈవో-2 రామనరసప్ప అన్నారు. సోమవారం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన కంప్యూటర్ కోర్సు శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సాయినాథ్, లక్ష్మణసాయి, జయరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైళ్లను పునరుద్ధరించాలి



ఎంపీ బైరెడ్డి శబరికి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దయిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను వెంటనే పునరుద్ధరించాలనీ సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే.రామాంజనేయులు కోరారు. సోమవారం నంద్యాలలో ఎంపీ బైరెడ్డి శబరికి, కర్నూలులో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్‌ను వేర్వేరుగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు నుంచి విజయవాడకు, కోస్తా ప్రాంతాలకు సౌకర్యంగా ఉండే విధంగా రైళ్లను యథావిధిగా కొనసాగించాలని కోరారు. రైళ్లను రద్దు చేయడంతో చిరువ్యాపారులు, విద్యార్థులు, చిరు ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహా య కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, కార్యవర్గ సభ్యులు సుంకయ్య, నాగరాముడు పాల్గొన్నారు.

యాగంటిలో ఘనంగా పల్లకీ సేవ

బనగానపల్లె, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవ సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, మౌళీశ్వరరెడ్డిలతో పాటు భక్తులు, పూజారులు పల్లకీలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.



స్వామివార్ల విగ్రహాల ఊరేగింపు

మాదిగ జాతి కల సాకారం : ఎమ్మార్పీఎస్

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మాదిగ జాతి చిరకాల స్వప్నం ఎస్సీ వర్గీకరణ సాకారం చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వా నిదేనని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దస్తగిరి, మంద విజయ్, పసులూరి నారాయణ అన్నారు. సోమవారం కొలిమిగుండ్లలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఏపీలో డీఎస్సీ ద్వారా మొదటిసారి వర్గీకరణ అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తోళ్ల నాగాంజనేయ, కొండా నాగరాజు, చిన్నపుల్లయ్య, నాగరాజు, ఓబులేషు, దస్తగిరి, కౌసి, వెంకటేషు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

డోన్ టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైసీపీ మాజీ కౌన్సిలర్ మంగమూరి గోపాల్ కుటుంబ సభ్యులను ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సోమవారం పరామర్శించారు. అలాగే వైసీపీ కార్యకర్త ఎర్రమల కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బుగ్గన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు వైసీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, మల్లెంపల్లె రామచంద్రుడు, పోస్టు ప్రసాద్, వైసీపీ మండల అధ్యక్షులు సోమేశ్ యాదవ్, చంద్రశేఖర్, దినేష్‌గౌడు, పెయింటర్ వెంకటేశ్ తదితరులున్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బుగ్గన

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

చాగలమర్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రాయితీ రుణాలకు మండలంలోని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మండలానికి 15 యూనిట్లు మూడు బ్యాంకుల పరిధిలో మంజూరైనట్లు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

డోన్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటరులో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు బీసీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోమవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మూడు నెలల పాటు మహిళలకు శిక్షణ ఇచ్చి అనంతరం కుట్టుమిషన్ ఉచితంగా ఇవ్వనున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలని నిర్వాహకులు కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

చాగలమర్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పించాలని అన్నారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. 12 పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా కేటాయించామని అన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు ఇమ్రాన్ సూచించారు. సోమవారం ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ఎండలు అధికమవుతుండటంతో వడదెబ్బ సోకే అవకాశం ఉందని అన్నారు. అధిక భాగం నీడనిచ్చే ప్రదేశాల్లో ఉండాలని అన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తికి వైద్య చికిత్సలు అందించాలని అన్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీఐకి సన్మానం

శిరివెళ్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : శిరివెళ్ల సర్కిల్ సీఐగా దస్తగిరి బాబు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సీఐ దస్తగిరి బాబును కలిసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మం డల ప్రధాన కార్యదర్శి మురళి, నాయకులు సూరా రామ, ఉల్లి వెం కట సుబ్బయ్య, బీసీ ఫిదా హుసేన్, భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి తదితరులు సీఐను కలిశారు.



సీఐని సన్మానించిన టీడీపీ నాయకులు

నష్టపోయిన రైతుల వివరాలు సేకరిస్తున్నాం

రుద్రవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షానికి నష్టపోయిన రైతుల వివరాలు సేకరిస్తున్నట్లు ఏవో సుమతి తెలిపారు. సోమవారం ఆలమూరు, నర సాపురం గ్రామాల్లో తడిచిన వరి ధాన్యాన్ని, మొక్కజొన్నలను ఆమె పరిశీలించారు. అలాగే చిత్రేణిపల్లె, ముకుందాపురం, ఇంకా పలు గ్రామాల్లో వరి ధాన్యం తడిచిపోయిందని గుర్తించామన్నారు. సేకరించిన వివరాలను వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. రంగుమారిన ధాన్యం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని ఏవో అన్నారు.

విద్యుత్ సంస్థకు రూ.30లక్షలు నష్టం: డీఈ

రుద్రవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ పరిధిలో ఆదివారం వచ్చిన గాలి వాన బీభత్సానికి విద్యుత్‌శాఖకు రూ.30లక్షలు నష్టం వాటిల్లిందని డిప్యూటీ డీఈ రవికాంత్ చౌదరి సోమవారం తెలిపారు. రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లో విద్యుత్‌శాఖకు భారీగా నష్టం వాటిల్లిందన్నారు. 300 విద్యుత్‌స్తంభాలు నేలకూలాయి. 50 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ అధికారులను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యను పరిష్కరించామన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు దిక్సూచి

రుద్రవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు దిక్సూచి అని టీడీపీ మండల కన్వీనరు ఎల్‌వీ రంగనాయకులు, నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు అన్నారు. చంద్రబాబు జన్మదిన సందర్భంగా ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు సోమవారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించండి

రుద్రవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దారు మల్లిఖార్జునరావు గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సమావేశంలో వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా మోడల్‌స్కూల్ ప్రవేశపరీక్షలు

బనగానపల్లె, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రవ్వల కొండలోని మోడల్‌స్కూల్‌లో 2025-26 సంవత్సరానికి ప్రవేశ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామలక్ష్మి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. 6వతరగతిలో ప్రవేశానికి మొత్తం 126 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 115 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మెరిట్ లిస్టు, రిజర్వేషన్ల అనుగుణంగా ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

కొలిమిగుండ్ల : కొలిమిగుండ్ల మోడల్‌స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 130 మంది విద్యార్థులకు గాను 119మంది పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

బనగానపల్లె, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి కోరారు. సోమవారం మండలంలోని పలుకూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఉపాధ్యాయులు , అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బనగానపల్లె, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు కోరారు. సోమవారం బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జరిమానా

రుద్రవరం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి ఆళ్లగడ్డ కోర్టు జరిమానా విధించిందని ఎస్ఐ వరప్రసాద్ సోమ వారం తెలిపారు. రుద్రవరం పోలీసుస్టేషన్ పరిధిలో మందలూరు గ్రామానికి చెందిన సన్నీడు అనే వ్యక్తి డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడినట్లు తెలిపారు. అతడిని ఆళ్లగడ్డ కోర్టులో న్యాయాధికారి ముందు ప్రవేశపెట్టగా రూ.10వేలు జరిమానా విధించిట్లు ఎస్ఐ తెలిపారు.